అంగన్‌వాడీల్లో సామూహిక అక్షరాభ్యాసాలు


అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పెందుర్తి: పాత పెందుర్తి, రెల్లి కాలనీ, బీసీ కాలనీల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. చిన్నారులతో ముందుగా సరస్వతి పూజలు చేయించారు. సీడీపీవో నీలవేణి పిల్లలతో ఓనమాలు దిద్దించారు. అనంతరం ఐదేళ్ల పిల్లలకు గ్రాడ్యుయేషన్ డే సందడిగా నిర్వహించారు. సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు బి.ధనలక్ష్మి, ఎం.జయలక్ష్మి, ఎం.నాగమణి, శ్రీదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉత్తమ భవిత

సబ్బవరం: ఎన్‌సీసీ క్యాడెట్స్ చదువుతో పాటు వివిధ క్రీడల్లో పాల్గొనడం ద్వారా మానసిక స్థైర్యాన్ని పెంపొందించుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని క్యాంప్ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ స్వర్నిమ్ ప్రభాత్ సూచించారు. స్థానిక దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయంలో 13వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో కొన్ని రోజులుగా జరుగుతున్న యువశక్తి వార్షిక శిక్షణా శిబిరంలో గురువారం ముఖ్య అతిథిగా పాల్గొని, మాట్లాడారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు శాయశక్తులా కృషి చేయాలని ఆకాంక్షించారు. ఇలాంటి శిక్షణ శిబిరాలతో శారీరక, మానసిక దృఢత్వం చేకూరుతుందన్నారు. శిబిరంలో శిక్షణ పొందుతున్న క్యాడెట్స్‌ను ఆల్ఫా, బ్రేవో, చార్లీ, డెల్టా ఈకో, ఫాక్స్ ట్రాట్ కంపెనీలుగా విభజించి ఆయా జట్లకు వ్యాసరచన, డిబేట్, క్విజ్, పోస్టర్ మేకింగ్, వాలీబాల్, త్రోబాల్, టగ్ ఆఫ్ వార్ తదితర పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్యాడెట్స్‌కు బహుమతులు, ప్రశంసా పత్రాలను అందించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ శ్రీనివాసరావు, ఎన్‌సీసీ అధికారులు, వివిధ విద్యా సంస్థల నుంచి వచ్చిన 468 ఎన్‌సీసీ క్యాడెట్స్ పాల్గొన్నారు.



వివిధ పోటీల్లో గెలుపొంది ప్రశంసా పత్రాలు అందుకున్న ఎన్‌సీసీ క్యాడెట్స్‌తో, ఎన్‌సీసీ క్యాంప్ అధికారులు

ఏడాదిలోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధి


ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

పెందుర్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ఎన్నో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గురువారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మొత్తం రూ.229 కోట్ల నిధులతో పెందుర్తి నియోజకవర్గ పరిధి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామన్నారు. వీలైనంత వేగంగా వాటిని పూర్తి చేయనున్నట్లు వెల్లడించారు. జీవీఎంసీ ద్వారా రూ.117.79 కోట్లతో 243 పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా రూ.26.85 కోట్ల నిధులతో చేపట్టిన కొన్ని పనులు ఇప్పటికే పూర్తవగా, మరికొన్ని కొనసాగుతున్నాయని చెప్పారు. అలాగే ఇతర విభాగాల నిధులతో ప్రారంభించిన పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయని, త్వరితగతిన వాటిని పూర్తిచేస్తామని వెల్లడించారు.

ట్రాఫిక్ జామ్.. గంటన్నర అవస్థలు


ఊటగెడ్డ కూడలిలో ట్రాఫిక్ జామ్‌లో నిలిచిపోయిన వాహనాలు


ఎన్టీపీసీ రహదారిలో నిలిచిపోయిన వాహనాలు

పరవాడ: యలమంచిలి-పరవాడ రహదారి ఊటగెడ్డ కూడలిలో గురువారం ఉదయం ట్రాఫిక్ జామ్ అయింది. యలమంచి-పరవాడ రహదారి, ఊటగెడ్డ-ఎన్టీపీసీ రహదారుల్లో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఊటగెడ్డ కూడలి వద్ద రెండు భారీ వాహనాలు ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. ఉదయం 8 గంటల సమయంలో ఏర్పడిన ట్రాఫిక్ సమస్యతో ఎన్టీపీసీ, హిందూజా, ఫార్మాసిటీ పరిశ్రమల్లో విధులకు హాజరయ్యే ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు గంటన్నర పాటు నిలిచిపోయిన ట్రాఫిక్‌లో భారీ వాహనాలు, ద్విచక్ర వాహనచోదకులు, బస్ ప్రయాణికులు చిక్కుకుని అవస్థలు పడ్డారు. పరవాడ పోలీసులు రంగంలోకి దిగి ట్రాఫిక్‌ను క్లియర్ చేయడంతో ప్రయాణికులు, ఉద్యోగులు, కార్మికులు ఊపిరిపీల్చుకున్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన ఘనంగా జరిపారు. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ సంపెంగలతో అష్టోత్తర శతనామావళి పూజ చేశారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను కొలువుంచి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.


స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు


నిత్యకల్యాణంలో తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

భైరవవాక మార్గాన్ని తెరవాలి


భైరవస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన గేటు వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నేతలు

సింహాచలం: భైరవవాకకు వెళ్లే మార్గాన్ని బంద్ చేస్తూ అటవీశాఖ ఏర్పాటుచేసిన గేటుని తొలగించాలని విశాఖ జిల్లా బీజేపీ డిమాండ్ చేసింది. జిల్లా బీజేపీ అధ్యక్షుడు పరశురామరాజు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు గురువారం భైరవవాక వద్ద నిరసన తెలిపారు. తొలుత భైరవస్వామిని దర్శించుకుని, స్వామికి అభిషేకం నిర్వహించారు. అనంతరం పరశురామరాజు మాట్లాడుతూ భైరవస్వామి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుంటారని, ఆలయానికి వెళ్లే కిలోమీటర్ మార్గాన్ని మూసేస్తూ అటవీశాఖ గేటు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీంతో భక్తులు నడిచి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే గేటును తొలగించాలని డిమాండ్ చేశారు. అటవీశాఖ నిర్ణయం చాలా తప్పు అని, అసలు అటవీశాఖ పరిధిలో ఈ ప్రాంతం లేదని ఆరోపించారు. ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్తామన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి జె.దామోదర్ యాదవ్, జిల్లా కార్యదర్శి నాదెళ్ల జ్యోతి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు ఉమ్మిడి సుజాతారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమాంబ పండగ


దుర్గమాంబను దర్శించుకుంటున్న స్థానిక నాయకులు, భక్తులు

పరవాడ: మండలంలోనిపరవాడ గ్రామంలో కొలువుదీరిన దుర్గమాంబ అమ్మవారి పండగను గురువారం గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువజాము నుంచి భక్తులు అమ్మవారికి పసుపు కుంకుమలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, పార్టీ సీనియర్ నాయకులు చుక్క రామునాయుడు, చల్లా కనకారావు, ఆలయ ధర్మకర్త పైల పోతినాయుడు, నాయకులు రెడ్డి శ్రీనివాసరావు, పైల నరసింగరావు, సిరపరపు అయ్యబాబు, లాలం సన్యాసిరావు, అప్పారావు, వర్రి భాస్కరరావు, గండి నమో, వర్రి హరి, పైల ప్రసాద్, బండారు రాజు, చుక్క గోపి, పైల రాధాకృష్ణ, యూత్ సభ్యులు అమ్మవారిని దర్శించుకుని, పూజలు జరిపి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


రైల్వే ట్రాక్ వద్ద పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెందుర్తి: దువ్వాడ-గోపాలపట్నం రైల్వే లైన్ మధ్య గుర్తు తెలియని రైలు నుంచి ప్రమాదవశాత్తూ జారి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం చెందినట్లు జీఆర్పీ పోలీసులు గురువారం గుర్తించారు. జీఆర్పీ సబ్ ఇన్‌స్పెక్టర్ కె.టి.ఆర్. లక్ష్మి తెలిపిన వివరాలు.. మృతుని వయసు 35-40 ఏళ్లు ఉండవచ్చన్నారు. సిమెంట్ రంగు టీ షర్ట్, నేవీ బ్లూ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడన్నారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదని పేర్కొన్నారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కేజీహెచ్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. మృతుని గురించి తెలిసినవారు 73820 58996 ఫోన్ నెంబర్లో సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

మోదీ పాలనతో సమగ్రాభివృద్ధి


కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు, బీజేపీ నేత చిక్కాల సతీష్

పెందుర్తి: ప్రధాని నరేంద్రమోదీ పాలనతో దేశం సమగ్రాభివృద్ధి సాధించిందని 95వ వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఎన్‌డీఏ ప్రభుత్వ ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా బీజేపీ 95, 97వ వార్డు అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ముమ్మన దేముడు చేతుల మీదుగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తి తహసీల్దార్‌గా ఆనంద్ కొనసాగింపు!

ఈ నెల 21 వరకు ఆయనకే అధికారాలు



పెందుర్తి: అధికారికంగా బదిలీ అయిన పెందుర్తి తహసీల్దార్ ఎం.ఆనంద్‌కుమార్ తిరిగి అదే స్థానంలో కొనసాగనున్నారు. మూడు రోజుల క్రితం సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ తహసీల్దార్‌గా విధుల్లో ఉన్న ఆనంద్‌ను అనకాపల్లి జిల్లాకు బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి(జీకె వీధి) తహసీల్దార్ టి.రామకృష్ణను స్థానిక కూటమి ప్రజాప్రతినిధి సిఫార్సు మేరకు పెందుర్తి తహసీల్దార్‌గా నియమించారు. అయితే ఆయన చార్జి తీసుకునేందుకు సిద్ధమవుతున్న తరుణంలో.. గతంలో అవినీతి ఆరోపణల నేపథ్యంలో రామకృష్ణకు బాధ్యతలు అప్పగించేందుకు కలెక్టర్ హరేందిరప్రసాద్ ఇష్టపడలేదు. ఈ నేపథ్యంలో గురువారం మండల హెచ్‌డీటీ సంతోష్‌కిరణ్‌కు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా బాధ్యతలు అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. బదిలీపై అనకాపల్లి వెళ్లాల్సిన తహసీల్దార్ ఆనంద్‌కుమార్ సైతం గురువారం డీటీకి బాధ్యతలు అప్పగించేందుకు రోజంతా వేచి ఉన్నారు. అయితే సాయంత్రానికి ఆనంద్‌కుమార్‌ను ఈ నెల 21న జరగనున్న యోగా దినోత్సవం వరకు పెందుర్తి తహసీల్దార్‌గానే విధులు నిర్వర్తించాలని ఆదేశించినట్లు సమాచారం. ఆ తరువాత ఆనంద్‌ను కొనసాగిస్తారా..? లేదా? అన్నది ఉన్నతాధికారులు ఎలాంటి ప్రకటన జారీ చేయలేదు. అయితే ఆనంద్‌కుమార్‌ను ఇక్కడి నుంచి ఎలా అయినా పంపేందుకు జిల్లా ఉన్నతాధికారులపై కూటమి ముఖ్యనేత విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే సమయంలో కూటమికి చెందిన మరో ముఖ్యనేత ఆనంద్‌ను ఇక్కడే ఉంచేందుకు ఉన్నతాధికారులను సిఫార్సు చేసినట్లు సమాచారం. మొత్తానికి అత్యంత ప్రాధాన్యత కలిగిన పెందుర్తి రెవెన్యూ మండలానికి పూర్తిస్థాయి తహసీల్దార్‌ను నియమించకుండా..ఉన్నవారినే పూర్తిస్థాయిలో కొనసాగించకుండా ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఆటలాడడంపై ప్రజలు పెదవి విరుస్తున్నారు.